క్లుప్తంగా

శ్రీవేణుగోపాల స్వామిని దర్శించుకున్న జడ్జి



రామారావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

జూలూరుపాడు: కాకర్ల శ్రీ రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామిని కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. రామారావు దంపతులకు అర్చకులు ఆరుట్ల లక్ష్మణా చార్యులు, వరుణ్ కుమార్, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు మిర్యాల రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరెక్టర్(పా) అభినందన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాఠశాల కొత్తగూడెంలో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన ఆరుగురు (కే.అష్మిత, సెక్టార్-2, ఎస్‌కే అలియా తన్వీర్, సనా, విశాల్, యువన్, వర్దన్) విద్యార్థులను శనివారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్(పా) కే.వెంకటేశ్వర్లు అభినందించారు. తొమ్మిది పాఠశాలల్లో 500 మందిలో 53 మందికి పైగా 500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... రానున్న 2025–26 విద్యా సంవత్సరానికి అందరికీ 600 మార్కులు వచ్చేవిధంగా కృషి చేస్తామని, అదే విధంగా ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు సింగరేణి సంస్థ దీటుగా నిలుస్తుందన్నారు. అధ్యాపకులు అంకితభావంతో అత్యుత్తమ విద్యనందించాలని, ప్రధానంగా వెనబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కే.సునిల్‌కుమార్, ఎస్‌ఓటూ డైరెక్టర్(పా) సుశీల్‌కుమార్, హెచ్‌ఎం సాయి సుజాత, డి.ప్రతాప్ పూల్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు నివాళి

టేకులపల్లి: భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో భాగంగా శత్రువులతో పోరాడి కశ్మీర్‌లో అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగం వృథా కాదని బొమ్మనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య అన్నారు. ఈ మేరకు శనివారం బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సిబ్బందితో కలిసి మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. దేశ రక్షణలో భారత సైనికులు చేస్తున్న పోరాటాలు, త్యాగాలను కొనియాడారు. దేవ్‌సింగ్, చరణ్, వసీం పాషా, యాకూబ్ పాషా, నాగుల్‌మీరా, ప్రవర్ధన్‌కుమార్, శ్రీనివాసాచారి, లచ్చు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను నివారించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పార్వతీశం

సింగరేణి(కొత్తగూడెం): పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులపై సంబంధిత అధికారులు, ఉద్యోగులకు శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ భవన్‌లో హిందుస్తాన్ అకాడమి ఆఫ్ లా (విశాఖ పట్టణం) కళాశాల ప్రొఫెసర్ వి.పార్వతీశం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెం రీజియన్‌లోని కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సెక్షన్ 4(1) ప్రకారం మహిళలు తమ పని ప్రదేశాలలో ఎదుర్కొనే లైంగిక వేధింపుల నివారణ, పరిష్కారం అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేస్ స్టడీస్ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీ జీఎం జి.రఘుపతి, డీజీఎం (పర్సనల్) కేసా నారాయణరావు, అధికారులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... రంగాపురం గ్రామం వద్ద బీసీఎం జాతీయ రహదారిపై భద్రాచలం నుంచి పాల్వంచకు వస్తున్న కారు.. పాల్వంచ నుంచి రంగాపురం వైపు వెళ్తున్న ఆటోను శుక్రవారం ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ కొండ్రు భద్రయ్యకు గాయలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం క్షతగాత్రుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కారు డ్రైవర్ ముదురుకోళ్ల విద్యాసాగర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

- అన్నింటికీ స్వీపరే దిక్కు..
- ఇన్‌చార్జ్‌తోనే సరిపెడుతున్న అధికారులు
- ఊడి పడుతున్న స్లాబ్ పెచ్చులు



టేకులపల్లి గ్రంథాలయ భవనం



పుస్తకాల గదికి తాళం వేసి ఉన్న దృశ్యం

టేకులపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. గోడలకు బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఊడిపడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు, నిర్వాహకులు భయాందోళనకు గురవుతున్నారు. టేకులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో 2007లో అప్పటి ఖమ్మం ఎంపీ రేణుకాచౌదరి నిధులతో ఈ భవనం నిర్మించి ప్రారంభించారు. విజ్ఞానాన్ని పెంపొందించే వివిధ రకాల పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచారు. వీటిని వినియోగించుకుని పలువురు ఉన్నత స్థాయికి చేరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు, సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారు. అలాంటి చరిత్ర కలిగిన ఈ గ్రంథాలయానికి ప్రస్తుతం ఆదరణ కరువైంది. వర్షం పడితే స్లాబ్ కురుస్తోంది. పెచ్చులు ఊడి పడుతున్నాయి. గతంలో ఒకసారి పెచ్చులు ఊడి పడుతుండగా లైబ్రేరియన్ తృటిలో తప్పించుకున్నారు. గ్రంథాలయానికి ప్రహరీ లేదు. కిటికీలు, తలుపులు చెదలు పట్టి దెబ్బ తింటున్నాయి. పాములు సైతం లోపలికి వస్తున్నాయి.

స్వీపరే దిక్కు.. ఇన్‌చార్జ్‌తోనే నిర్వహణ...

టేకులపల్లి గ్రంథాలయంలో రెగ్యులర్ లైబ్రేరియన్ రెండేళ్ల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇల్లెందు లైబ్రేరియన్‌ను టేకులపల్లికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రతీ బుధవారం మాత్రమే ఆమె వస్తారు. మిగిలి రోజుల్లో స్వీపరే దిక్కు. ప్రస్తుతం ఉదయం 8–11, సాయంత్రం 3–6 గంటల వరకు లైబ్రరీ తెరిచి ఉంచుతున్నారు. లైబ్రేరియన్ వచ్చినప్పుడు మాత్రమే పుస్తకాల గది తెరిచి ఉంటుంది. మిగిలిన రోజుల్లో తాళం వేస్తారు. ముందు గదిలో వార్తా పత్రికలు, పిల్లల కోసం కొన్ని కథల పుస్తకాలు మాత్రమే ఉంటాయి. ఫ్యాన్ లేక వచ్చినవారు ఎక్కువ సేపు ఉండలేని దుస్థితి. గతంలో వందల సంఖ్యలో తాజా సమాచారం, పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు ఉండేవి. ప్రస్తుతం పాత పుస్తకాలే ఉన్నాయి. దీంతో పాఠకుల ఆదరణ కరువైంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం మంజూరు చేయాలని, రెగ్యులర్ లైబ్రేరియన్‌ని నియమించాలని, అన్నిరకాల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పాఠకులు కోరుతున్నారు.

పూర్వ వైభవం తీసుకరావాలి...



టేకులపల్లి గ్రంథాలయానికి మంచి చరిత్ర ఉంది. గతంలో అన్ని సౌకర్యాలు, ఉపయోగకర తాజా సమాచారం, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఇక్కడ చదువుకుని వందల సంఖ్యలో యువకులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించారు. రెగ్యులర్ లైబ్రేరియన్‌ని నియమించాలి. తాజా, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
– నోముల భానుచందర్, టేకులపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..



టేకులపల్లి గ్రంథాలయానికి ఇన్‌చార్జ్‌గా చేస్తున్నాను. భవనం స్లాబ్‌పైన పెచ్చులు ఊడుతున్నాయి. కిటికీలు, తలుపులు సరిగా లేవు. ప్రస్తుతం పాత పుస్తకాలే ఉన్నాయి. కొత్త పుస్తకాలు ఇంకా రాలేదు. వీటన్నింటి గురించి ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. మండల ఏఈ కూడా వచ్చారు. ఎస్టిమేషన్ వేసుకుని వెళ్లారు.
– రుక్మిణి, లైబ్రేరియన్, టేకులపల్లి

అభివృద్ధి సంక్షోభంలో పడింది..



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడిందని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్ సిటీ కార్యాలయంలో కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సగ భూభాగం వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతంలో ఉందని, ఇక్కడ ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సీ రిజర్వేషన్ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, జనరల్‌లో కలపడం వలన లక్షలాదిమంది ఎస్సీ కులాల తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం లేకుండా తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. ఎస్సీ రైతులు తరతరాలుగా సాగు భూములకు, పోడు భూములకు హక్కు లేకుండా అంధకారంలో నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు వివరించారు.

కార్మిక సమ్మెను వ్యతిరేకించండి..



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 20న సమ్మె దేశ వ్యాప్త సమ్మెను, సింగరేణిలో జాతీయ వామపక్ష యూనియన్లు, ఇతర యూనియన్లు ఇచ్చిన ఒక్క రోజు టోకెన్ సమ్మె పిలుపును వ్యతిరేకించాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శనివారం కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జాతీయ కార్మిక సంఘాలు తమ ఉనికిని చాటేందుకు నిర్వహించే సమ్మె రాజకీయ ప్రేరణతో కూడిన చర్య ఇది బాధ్యతా రాహిత్య నిర్ణయమన్నారు. కార్మికులు దీన్ని వ్యతిరేకించాలన్నారు. భారతదేశం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందని. పాకిస్తాన్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన అపరేషన్ సింధూర్ కార్యక్రమంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు తీవ్రంగా పోరాడుతోందన్నారు. ఇటీవలి కాలంలో మెడికల్, భద్రతా అత్యవసర పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని కార్మిక సంగాలు ఈనెల 20న సమ్మెకు పిలుపునివ్వటం గర్హనీయమన్నారు. ఈ సమ్మెను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు తీసుకొని కార్మికుల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పవన్‌కుమార్, రాంసింగ్, కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, నాగప్రసాద్, ఎం.శ్రీనివాస్, వెంకటరెడ్డి, ఏ.వెంకటేశ్వర్లు, రాజేశ్, శ్రావణ్‌కుమార్, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కిరణ్‌రాజ్‌కుమార్

ఇల్లెందు: సింగరేణి ఏరియా ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందుతుందా.. డాక్టర్లు, సిబ్బంది స్పందన ఎలా ఉంది.. మందులు సరిపడా అందజేస్తున్నారా.. అంటూ రోగులను సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఇల్లెందు సింగరేణి ఏరియా ఆస్పత్రిని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రిజిష్టర్లు, మందులు, స్టోర్ రూమ్, వార్డు రూమ్, అత్యవసర విభాగాన్ని, స్టాక్ పాయింట్, ఆక్సిజన్ మిషన్ల పని తీరు, రోజు వారీ రక్తం, మూత్రం, పరీక్షల వివరాలు, ఎక్స్‌రే రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడుతూ.. సింగరేణి ద్వారా ఉన్నత వైద్యం పొందే మార్గం ఉందని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం అక్కడి డాక్టర్లు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ... ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. ఆయన వెంట మెడికల్ సూపరింటెండెంట్ నరసింహారావు, ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ఏఐజీ ఐఈడీ గిరధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు ఉన్నారు.

అన్నదాతల ఆందోళన



కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

పాల్వంచరూరల్: లారీలు రావడం లేదనే నెపంతో కొనుగోలు కేంద్రంలో కాంటా పెట్టిన ధాన్యాన్ని ఆరురోజులుగా తరలించడం లేదని, ఉన్న ధాన్యాన్ని కాంటా వేయడం లేదని బాధిత రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్డిగూడెం కొనుగోలు కేంద్రంలో ఆరు రోజుల క్రితం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలు రాకపోవడంతో కేంద్రంలో నిల్వ ఉంచారు. దీనికి తోడు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచి ధాన్యానికి కూడా మిల్లర్లు తరుగు కింద అధికంగా డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డికి సన్మానం



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ ఎన్‌ఎండీసీ యూనిట్ నాయకులు శనివారం ఆయన స్వగృహంలో సన్మానించారు. మాట్లాడుతూ... ఎన్‌ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించి కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలన్నారు. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బాలు నాయక్, కోటేశ్వరరావు, సాంబశివరావు, అగరత్తయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో మ్యాన్ పవర్ పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా సీహెచ్‌పీలో మ్యాన్ పవర్ తక్కువగా ఉందని, ఇక్కడి ఉద్యోగుల మీద అదనంగా పని భారం పడుతోందని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ కోరారు. శనివారం ఇల్లెందులో సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ డీవైజీఎం క్రిష్టఫర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... సీహెచ్‌పీలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. జనరల్ అసిస్టెంట్లు, క్లర్క్ స్టాఫ్‌లు తక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రతీరోజు రెండు రేకుల బొగ్గు సరఫరా జరుగుతుందని జనరల్ అసిస్టెంట్లు తక్కువగా ఉండటం వల్ల రేక్ చెకింగ్, డంపింగ్‌లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. క్లర్కుల వల్ల వే బ్రిడ్జిలలో జనరల్ అసిస్టెంట్లను పెట్టి విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు యాకుబ్, అప్పిరెడ్డి, సంతోష్‌కుమార్, కుమార్, రాజలింగం, పద్మ ఉన్నారు.

'రాజీవ్ యువ వికాసం' వర్తింపజేయాలి

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఆటో కార్మికులకు వర్తింపజేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి సభ్యుడు పత్తిపాటి మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాపకొల్లు ఆటో స్టాండ్ వద్ద జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసాన్ని సివిల్ స్కోర్ ఆధారంగా అమలు చేయడం వల్ల ఆటో కార్మికులకు ఇబ్బందిగా ఉందన్నారు. సివిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ వికాసం పథకాన్ని ఆటో కార్మికులకు ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో కార్మికులను రాజీవ్ యువ వికాసం పథకంతో ఆదుకోవాలని కోరారు. నిమ్మటూరి లచ్చయ్య, పానిగంటి మహేష్, కృష్ణ, రమణయ్య, శివ, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

గిరిజన సంఘాల జోలికి వస్తే సహించం..



మాట్లాడుతున్న మోతీలాల్

కొత్తగూడెంటౌన్: గిరిజన సంఘాల జోలికి వస్తే సహించేది లేదని, రెడ్డి రాజ్యంపై లంబడోళ్ల లడాయి షూరు చేస్తామని సేవాలాల్ సేనా బంజార సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ హెచ్చరించారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం లక్ష్మీదేవిపల్లిలో సేవాలాల్ సేనా బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్‌నాయక్ ఆధ్వక్షత జరిగిన కార్యక్రమంలో మోతీలాల్ పాల్గొని మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 17 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. రెడ్డి రాజ్యంలో లంబాడీలకు స్థానం లేదన్నారు. కొత్తగూడెం వేదికగా రెడ్డిల మీద లంబాడిల లడాయి షురూ చేస్తామన్నారు. త్వరలో కొత్తగూడెంలో వేలాది మందితో ర్యాలీ తీస్తామని ఏజెన్సీ జిల్లాలో చట్టాలపై గిరిజనులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు పేరుతో పేద గిరిజన ప్రజలకు ఉపాధి హామీ పథకం లేకుండా చేస్తున్నారని వాపోయారు. బూర్గంపాడు మండలం సారపాక గాంధీనగర్‌లో గిరిజనుడి ఇంటి ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కులాల మధ్య చిచ్చు పెట్టడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం పోడు భూములపైనే అని ఇచ్చిన హామి ఏమైందని ప్రశ్నించారు. జిల్లాలోని సమస్యలపై హైదరాబాద్‌లో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేనా బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు నునావత్ రాంబాబు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు శ్రీనివాస్‌నాయక్, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నందిని బాయ్, లావుడ్యా సత్యనారాయణనాయక్, తేజావత్ రవికుమార్ నాయక్, బట్టు వీరన్న నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

18న ఆదివాసీల బహిరంగ సభ



ప్రచారం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందురూరల్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ కల్తి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి తెలిపారు. ఈ మేరకు మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కుమురం భీం కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలోకి అక్రమంగా చేరిన లంబాడాలు ఉద్యోగ, ఉపాధి వనరులను ఆదివాసీలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించే వరకు ఉద్యమ కార్యాచరణ రూపకల్పన, ఉద్యమ ఆవశ్యకతను వివరించి ఆదివాసీలను చైతన్యపర్చే లక్ష్యంతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జారె కృష్ణ, పోలెబోయిన వెంకటేశ్వర్లు, మెట్ల పాపయ్య, జోగ రామబ్రహ్మం, బుగ్గ రామనాథం, ఈసం వీరస్వామి, కొర్స రాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



రైతులతో మాట్లాడుతున్న డీటీ మహేష్

జూలూరుపాడు: స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడెం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ మహేష్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోళ్లు, సౌకర్యాలను పరిశీలించి, రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... దినపత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం సేకరణ కేంద్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. అకాల వర్షానికి ధాన్యం తడవలేదని, రైతులు ముందుస్తుగా జాగ్రత్త పడటంతోపాటు, సహకార సిబ్బంది అప్రమత్తంతో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫాసిజంపై కమ్యూనిజం విజయం



మాట్లాడుతున్న శ్రీధర్

జూలూరుపాడు: ఫాసిజంపై కమ్యూనిజం విజయం సాధించిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. శనివారం జూలూరుపాడులో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధం జరగడానికి ఫాసిజమే కారణమన్నారు. ప్రపంచాన్ని ఫాసిజం బారి నుంచి రక్షించేందుకు సోవియట్ యూనియన్ సైన్యం వీరోచితంగా పోరాడి విజయం సాధించిందని, అయితే ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఈ యుద్ధంలో రెండు కోట్ల మంది ప్రాణాలు కోల్పోయారని, ఎందరో క్షతగాత్రులయ్యారని, నగరాలు, పట్టణాలు శిథిలాలుగా మారినట్లు చెప్పారు. సోవియట్ యూనియన్ ప్రభావంతో భారతదేశానికి వలస పాలకుల నుంచి విముక్తి కలిగిందని, ఇండియా సోషలిస్టు తరహా ఆర్థిక విధానాలు చేపట్టిందన్నారు. మిశ్రమ ఆర్థిక విధానం, సంక్షేమ రాజ్యంగా పేరొందిందని, అందుకే ఇండియాకు రష్యా కీలక మిత్రుడన్నారు. కార్యక్రమంలో యాసా నరేష్, బానోత్ ఇస్రా, గార్లపాటి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



ఇల్లెందు: సైనికులకు మద్దతు తెలుపుతున్న జర్నలిస్టులు



జూలూరుపాడులో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇల్లెందు: గత నెలలో జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల మీద పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది భారత పర్యాటకులు మృత్యువాత పడ్డారని, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మీద భారత సైన్యం ప్రతీకారం తీర్చుకోగా.. ఉగ్రవాదులకు మద్దతుగా పాక్ సైన్యం భారత్ మీద యుద్ధం చేస్తోందని ఈ సంఘటనను యావత్ ప్రపంచం గ్రహించాలని ఇల్లెందు జర్నలిస్టులు కోరారు.

శనివారం పాక్ ఉగ్రవాద చర్యలకు నిరసనగా పాక్‌తో తలపడుతున్న భారత సైన్యానికి మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కె.రాజు, ఇ.నాగేశ్వరరావు, శ్రీకాంత్, ఎల్.వీరమోహన్, శోభన్ బాబు, కుమార్, మహేష్, రమణ, ముత్యం, నర్సి, దేవేందర్‌రెడ్డి, చారీ, శ్రీనివాస్, రామారావు, పొడుగు రాంబాబు, నటరాజ్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భారత సైన్యానికి మద్దతుగా ఆరోగ్య జీవన యాత్ర మార్నింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఉగ్రదాడులను ప్రేరేపించిన పాక్‌పై భారత్ దేశం చేస్తున్న యుద్ధానికి సంఘీభావంగా, యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు సంతాపం తెలుపుతూ స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీసాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పాక్ దేశానికి, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా భారత్ సైనికులకు జిందాబాద్.. వీరమరణం పొందిన సైనికులకు జోహార్లు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని, భవిష్యత్‌లో భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చేయాలన్నారు. కార్యక్రమంలో కాశ్లూరు వెంటేశ్వరరావు, బాపట్ల వెంకటేశ్వర్లు, వేల్పుల బోసు, తిప్పర్తి శివ, వందనపు కమలాకర్, కొండా వెంకటేశ్వర్లు, సాయిన్ని సత్యనారాయణ, కొదుమూరి భాను ప్రకాష్, వేల్పుల నరసింహారావు, బండ్ల వెంకటేశ్వర్లు, ఉసికల భాస్కర్, వీరన్న, పెండ్యాల నరేష్, తాళ్లూరి నవీన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.